

## సగ్గు రాజయ్య

**కో**ణార్క్ ఎక్స్‌ప్రెస్ భువనేశ్వర్ నుంచి ముంబయి వెళుతోంది. దాంట్లో ప్రయాణం చేస్తున్న రంగారావు, వడివేలు మంచి స్నేహితులు. రిజర్వేషన్ దొరకలేదు. భార్యాపిల్లలతో జనరల్ బోగీలో ప్రయాణం చేస్తున్నారు. రంగారావుకు ఇద్దరాడపిల్లలు, ఒక మగపిల్లవాడు. వడివేలుకు నలుగురూ ఆడపిల్లలే.

బండి ఎక్కడ లేటయ్యిందో... విజయవాడ దాటేసరికి గంటన్నర లేటన్నారు. జనరల్ బోగీకి వెస్టిబుల్ ఫెసిలిటీ లేదు. అయినా పెద్ద స్టేషన్ వచ్చినప్పుడల్లా ఇడ్లీ, వడ, ఇతర చిరుతిండ్లు అమ్ముతున్నారు వెండర్లు. బండి భువనగిరి దాటింది.

"ఒరే రంగారావ్, మనం సికింద్రాబాద్

సమీపిస్తున్నాం. మధ్యాహ్నం కావస్తోంది. భోజనం మాటేమిటి?" వడివేలు అడిగాడు.

"సికింద్రాబాద్‌లో అన్నానికి కరువేంటిరా? బండిలో నలభై రూపాయలిచ్చి పప్పన్నం తినే కంటే వాటికే ఇంకో పాతికో, ముప్పయ్యో కలిపితే హాయిగా అల్పాహారాలు, బిరియానీ తినవచ్చు" అన్నాడు నవ్వుతూ రంగారావు.

"బండ్లో ప్రయాణం చేసేవాళ్లకు బిర్యానీ ఎక్కడ దొరుకుతుందిరా?" ఆశ్చర్యంగా అడిగాడు వడివేలు.

"ఇప్పుడు హైదరాబాద్ మహానగరంరా! మన దగ్గర డబ్బు ఉంటే చాలు, ఏదంటే అది తినవచ్చు. ఏదంటే అది త్రాగవచ్చు. అది ఒక సికింద్రాబాద్‌కే ఉంది సుమా!"

"ఎలాగరా?"

"రైల్వేస్టేషన్‌కు ఆల్ఫా హెూటలు చాలా దగ్గరగా ఉంటుంది. పరిగెత్తుకువెళ్లి బిర్యానీ తెచ్చుకుని బండిలో కూర్చుని హాయిగా తినవచ్చు. ఇంతకుముందు ఓ స్నేహితుడితో వచ్చినపుడు అలాగే చేసాం".

పిల్లలు ఆశగా రంగారావు ముఖం చూస్తున్నారు.

"బండి ఆగినంతసేపట్లో బయటకు వెళ్లి బిర్యానీ కొనుక్కురావొచ్చా అన్నయ్యా" అడిగింది వడివేలు భార్య.

"ఎంతమ్మా? గట్టిగా నడిస్తే అయిదు నిమిషాలు. పరిగెత్తితే మూడు నిమిషాలు. పార్సెల్ ప్యాక్‌లు రెడీగా ఉంటాయి. డబ్బులు ఇవ్వగానే ఇచ్చేస్తాడు. అవి తీసుకుని, పరిగెత్తుకువచ్చి బండి పట్టుకోవచ్చు. అలా కోణార్క్ ప్యాసింజర్లు చాలామంది చేస్తారు".

"అల్లాగయితే అన్నయ్యా, మీరిద్దరూ తొందరగా వెళ్లి బిర్యానీలు పట్టుకురండి" అంది పర్సులోంచి డబ్బులు తీసి వడివేలుకు ఇస్తూ.

రంగారావు భార్య కూడా హేండ్‌బ్యాగ్ లోంచి డబ్బులుతీసి రంగారావుకు ఇచ్చింది. బండి మౌలాలి స్టేషను దాటుతోంది.

"అదిగో వచ్చేస్తూనే ఉంది సికింద్రాబాద్ స్టేషను. మేము వెళ్లి డోర్ దగ్గిర నిలబడి ప్లాట్‌ఫారం రాగానే తొందరగా దిగిపోతాము" అంటూ లేచివెళ్లారు.

హోమ్ సిగ్నల్‌మీద పదిహేను నిమిషాలు ప్లాట్‌ఫారమ్ సౌలభ్యం కోసం పెట్టిం తరువాత ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపైకి తీసుకున్నాడు. ఆగిందే తడవుగా చాలామందితోపాటు బండి దిగి రంగారావు, వడివేలు అవుట్ గేటువైపు పరిగెత్తారు.

అప్పటికే గేటుముందు పెద్ద గుంపు ఆగి ఉంది. అంతకుముందే సికింద్రాబాద్ చేరుకున్న మరో బండికి దిగినవాళ్లు కూడా బయటికి పోవడానికి తొందరపడుతున్నారు. వాళ్లకు తోడు కోణార్క్ పాసింజర్లు కూడా పోటీపడుతున్నారు బయటికి పోవడానికి.

రంగారావు, వడివేలు అందర్నీ తోసుకుంటూ బయటికి వచ్చేసరికి అయిదు నిమిషాలు కరిగిపోయాయి. తొందరగా ఆల్ఫా హెూటల్ వైపు పరిగెత్తారు. అక్కడ కౌంటర్ దగ్గిరా పెద్ద గుంపే ఉంది. డబ్బులు ఇచ్చి, బిర్యానీ ప్యాక్ తీసుకోవడానికి ఒకరినొకరు తోసుకుంటూ, డబ్బులు చేత్తో పట్టుకుని దీనంగా "నాకు రెండు ప్యాక్‌లు ఇవ్వు, నాకు నాలుగు ఇవ్వు" అంటూ అడుగుతున్నారు.

వడివేలుకు, రంగారావుకు ప్యాకులు దొరికే

సరికి అయిదారు నిమిషాలు పట్టింది. తీసుకుని రైల్వేస్టేషనువైపు కదులుతూంటే వడివేలు కంటిని బ్రాందీషాపు ఆకర్షించింది. వడివేలు ముఖంమీద చిరునవ్వు చిందేసింది.

"రంగారావూ! బిర్యానీ ఉంది కదా, ఒక క్వార్టరు బాటిల్ తీసుకుందాం" అతనికి మనస్సులోని కోరికతో నోట్లో లాలాజలం ఊరుతోంది. ఆటోమాటిగ్గా కాళ్లకు బ్రేకులుపడి, బ్రాందీషాపు వైపు తిరిగాయి.

"వడివేలూ! బండి వదిలితే చిక్కుల్లో పడతాము. ఆలస్యమైపోతూంది. తొందరగా వెళదాం నడు" భయంతో కంగారుపడుతూ అన్నాడు రంగారావు.

"ఆ... ఎంత రంగారావ్... రెండే రెండు నిమిషాలు" అంటూ కొట్లోకి వెళ్లి ఒక ఆఫ్ బాటిల్ తీసుకుని, నీవూ తీసుకో" అన్నాడు.

మొహమాటానికి రంగారావు కూడా ఓ క్వార్టరు బాటిల్ తీసుకున్నాడు.

ప్రక్కనున్న కొట్లో మిరపకాయల బజ్జీలు కొనుక్కుని, బాటిల్ విప్పి ఇంత నోట్లో పోసుకుని, బజ్జీ నములుత్తూ "ఆత్మారాముడు చల్లబడ్డాడు... ఇక పద రంగారావ్" అంటూ హడావిడి చేసాడు వడివేలు.

"ఏం పదనో పాడో... బండి ఉందో పోయిందో" అనుకుంటూ గుండెలో భయంతో ఇద్దరూ రైల్వేస్టేషన్ వైపు పరిగెత్తారు. బండి వెళ్లిపోవడంతో జనంలేక వెలవెలబోతోంది ప్లాట్‌ఫారం. ఖాళీ ప్లాట్‌ఫారం చూసి ఇద్దరికీ నోట మాట రాలేదు! నిండా చెమటలు పట్టాయి!!

"అరెరే... బండి వెళ్లిపోయిందే..." అన్నారు ఇద్దరూ ఒకేసారి ఆశ్చర్యం, భయంతో.

పిచ్చిచూపులు చూస్తూ కళ్లలో నీళ్లు తెచ్చుకున్నారు.

"బాబూ! కోణార్క్ ఎక్స్‌ప్రెస్ వెళ్లిపోయిందా?" అంటూ లైసెన్స్ కూలీని అడిగారు.

ఇప్పుడే పోయింది సార్. జేమ్స్ స్ట్రీట్ దాటుండొచ్చు. బండి తప్పిపోయిందా సార్? ఎక్కడకు పోయింర్రుసార్? అల్వా బిర్యానికి పోయింర్రా? అదేంది... చేతిసంచులల్ల నుంచి ఆసన వొస్తుంది కద" అన్నాడు.

ఇద్దరికీ ఒళ్లుమండిపోయింది వాడి మాటలకు.

"మేం ఎక్కడికి పోతే నీకేంటయ్యా. పక్క స్టేషనుకు ఆటోలో వెళితే మాకు బండి దొరుకుతుందా? లేదా? అది చెప్పి ఏడ్వు" అన్నాడు రంగారావు.

"అబ్బో, గుస్సకేం తక్కువలేదు. దినాము నీయసొంటి తప్పిపోయిన కేసులు ఒకటి రెండన్న ఉంటయి. అట్ల రైలుకట్టాలల్లబడి బేగంపేటకు ఉరుకుంర్రి. ఎవడన్న చెయిన్ గుంజితే మీరు పోయేదాక ఆగుతది" అన్నాడు వెటకారంగా.

"వాడిమాటలకేంగాని, నైన్‌టీనైన్ పర్సంట్ దొరకకపోవచ్చు. మీ అదృష్టం! దొరికితే దొరకొచ్చు. బయటికి వెళ్లి ఆటోలో బేగంపేటకు వెళ్లండి" అన్నాడు వాళ్ల సంభాషణ విన్న ఓ పెద్దాయన.

"నడు వడివేలూ! బయటకు వెళ్లి ఆటో పట్టుకుని, బేగంపేటకు వెళ్లి, అక్కడ బండి దొరుకుతుందేమో చూద్దాం పద" అన్నాడు రంగారావు అదుర్దాగా.

"ఈ బిర్యానీ కోసం నా పిల్లల్ని వదులుకున్నాను. నీవే చెప్పావు. ఇదంతా నాకేటి తెలుసు!" బిక్కమొహంతో కళ్లనీళ్లు ధారాపాతంగా కారుతుండగా వడివేలు అన్నాడు.

"నీవేకదయ్యా బ్రాందీషాపు కనబడగానే అక్కడికి దారితీసి బ్రాందీసీసా, మిర్చిబజ్జి కొనుక్కుని, తాగుతూ తిని, అయిదు నిమిషాలు లాస్ చేసావు".

"అక్కడవన్నీ ఉంటాయని నాకేటి తెలుసయ్యా? టైము సరిపోనప్పుడు నీవెందుకు నన్ను బిర్యానో, బిర్యానో అని ఊరించావయ్యా? ఆ బండ్లో ఏ గడ్డి దొరికితే అదే తినేవాళ్లం" అన్నాడు కోపంగా వడివేలు.

"బిర్యాని ఆశకు రైలుస్టేషను నుంచి బయటకు వచ్చావు. బిర్యాని తీసుకుని రాక బ్రాందిషాపులో దూరావు. టైము వేస్ట్‌చేసుకుని, బండి మిస్సయ్యేట్లు చేసావు. అందుకు తప్పునాదా?"

"ఆ ఆ... తప్పు ముమ్మాటికీ నీదే. అల్పాలో బిర్యాని దొరుకుతుందని, చిటికెలో తీసుకుని వస్తామని, తిరిగి బండి ఎక్కొచ్చని చెప్పావు. నా పిల్లలను నాకు దూరంచేసావు. నేను వాళ్లను ఎలా కల్సుకుంటానురో దేవుడోయ్" ఏడుపు లంకించుకున్నాడు కైపు తలకెక్కగానే.

వీరిద్దరి చుట్టూ జనం గుమిగూడారు.

"మీరు అట్టే వాదులాడుకుంటూ నిలబడితే, బండి బేగంపేట దాటిపోతుంది. తొందరగా వెళ్లండి బేగంపేటకు. పిల్లలను బండ్లో వదిలి ఎందుకు దిగినారయ్యా? వెళ్లండి, వెళ్లండి" అంది ఓ పెద్దావిడ.

"నీతో నాకో తలనొప్పయిపోయింది. నడు. బయటకు వెళ్లి ఆటో పట్టుకుందాం" అంటూ రంగారావు వడివేలుతో బయటికి పరిగెత్తాడు.

ఆటోలో కూర్చుని "బాబూ తొందరగా బేగంపేట స్టేషన్‌కి పోనీ. మాకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్ మిస్సయ్యింది. మా పిల్లలు దాంట్లో ఉన్నారు. మేము వాళ్లను కల్సుకోవాలి" అన్నాడు రంగారావు నోట్లో తడారిపోతుంటే.

"తప్పిపోయిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ని పట్టుకోనికి ఇదేమన్న ఇమానం అనుకున్నారా సార్, రోడ్డుమీద నడిచే ఆటో. నాతోకాదు దిగండి" అన్నాడు ఆటోడ్రైవర్ కటువుగా.

"బాబ్బాబు మీటరు మీద పది రూపాయలు ఎక్కువిస్తాం. తొందరగా నడు".

"మీటరు మీద ముప్పయిస్తే ఒస్తా. ఇస్పీడ్ కావాలంటరు. పైసలు ఎక్కువ కావా మరి".

"ఇస్తాంలే పద తొందరగా" అన్నాడు రంగారావు అసహనంగా.

క్లాక్‌టవర్ దాటి మున్సిపల్ ఆఫీసు ముందుకు వచ్చేసరికి విపరీతమైన ట్రాఫిక్ అయిపోయింది. ఆటో ముందుకు కదలడంలేదు.

"ఇలాగ వెళితే ట్రైన్ వెళ్లిపోతుంది" వడివేలు ఏడుస్తున్నాడు.

"ఇదిగో వడివేలూ, హైదరాబాద్ ట్రాఫిక్ గురించి వినలేదా? ఒక్కోసారి గంటలు పడుతుంది క్లియర్ కావడానికి. నీవు ఏడ్చి నన్ను భయపెట్టకు. బండ్లో మా పిల్లలు కూడా ఉన్నారు. నీకంటే నాకూ అదుర్దాగా ఉంది" అన్నాడు రంగారావు కోపంగా.

"ఉంటే ఉండనీయండి. మీ ఆవిడ చదువుకుంది. మా ఆవిడ చదువురానిది. పిల్లలు ఎంత ఏడుస్తున్నారో ఏమో" అని, కళ్లనీళ్లు తుడ్చుకుంటూ బ్రాందిసీసా విప్పి నోట్లో పోసుకున్నాడు. ఇరవై అయిదు నిమిషాల్లో వెళ్లే ఆటో యాభై అయిదు నిమిషాలు అయింది బేగంపేట స్టేషను చేరుకోవడానికి. ఆటోవాడికి డబ్బులిచ్చి, స్టేషన్‌లోకి పరిగెత్తారు. బండ్లులేక రెండు ప్లాట్‌ఫారంలు ఖాళీగా కన్పించేసరికి హతాశులైనారు. ఇద్దరూ బుకింగ్ ఆఫీసులోకి వెళ్లి, "సార్,

బొంబాయి వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ వెళ్లిపోయిందా సార్" అంటూ అడిగారు.

"మీరు ఎక్కడి నుండి వస్తున్నారు?" ఎగాదిగా చూస్తూ అడిగాడు బుకింగ్ ఆఫీసులోని వ్యక్తి.

"మేము విజయనగరం నుంచి బొంబాయి వెళుతున్నాం. మా పిల్లలను బండ్లో వదిలిపెట్టి భోజనానికి బయటికి వెళ్లి వచ్చేసరికి ట్రైన్ వెళ్లిపోయింది. మా ఇద్దరి ఫ్యామిలీలు వెనక గార్డు పెట్టె ప్రక్కన జనరల్ కోచ్‌లో ఉన్నారు. వాళ్లను కలుసుకునే మార్గం చెప్పండి సార్" ప్రాధేయ పూర్వకంగా అన్నాడు రంగారావు.

"ఉండు. నేను కంట్రోలర్‌తో చెపుతాను" అంటూ కంట్రోల్ ఫోన్ ఎత్తి "బేగంపేట, బేగంపేట..." అని సెక్షన్ కంట్రోలర్‌ని పిలిచాడు ఫోన్‌లో.

"ఆ చెప్పండి బేగంపేట..." సెక్షన్ కంట్రోలర్ ఆన్సర్ ఇచ్చాడు ఫోన్‌లో.

"కోణార్క్ లెఫ్ట్ బిహైండ్ కేసొకటి ఉంది సార్".

"ఎక్కడ? మీ దగ్గరేనా?"

"సికింద్రాబాద్‌లో సార్. బండి అందుతుందేమో అని ఆటో పట్టుకుని బేగంపేట వచ్చారు సార్. వాళ్ల రెండు కుటుంబాలు రియర్ జనరల్ కోచ్‌లో ఉన్నారట సార్".

"బండి ఎట్లా మిస్సయిందట?"

"భోజనానికని బయటికి వెళ్లారట సార్. ఈ లోపల బండి వదిలింది"

"అదే, అదే... బిర్యాని కేసన్నమాట".

అది విన్న బుకింగ్ మాస్టరు "ఏమయ్యా, మీరు బిర్యాని కోసం బయటికి వెళ్లారా?" అన్నాడు.

అవునని ఇద్దరూ తలలు ఊపారు.

"ఔను సార్. బిర్యానీ కోసమేనట".

"సరే. వాళ్ల కుటుంబాలను తాండూర్‌లో దింపే ఏర్పాటు చేస్తాను. వాళ్లను హుసేన్‌సాగర్‌లో వెళ్లి కల్సుకోమని చెప్పు. వాళ్ల పేర్లేమిటి?"

"మీ పేర్లేమిటండీ..."

"రంగారావు, వడివేలండీ"

ఆ పేర్లను కంట్రోలర్‌కి రిపీట్‌చేసి, "సార్, మీవాళ్లను తాండూర్‌లో దింపివేసే ఏర్పాటు చేస్తారు. ఇంకాసేపట్లో హుసేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్ రెండవ నంబరు ప్లాట్‌ఫారంపైకి వస్తుంది. మీ వాళ్లు కోణార్క్ దిగి, హుసేన్‌సాగర్‌లో ఎక్కుతారు తాండూర్‌లో".

"థాంక్యూ సార్. గొప్ప సహాయం చేసారు" అంటూ ఆనందబాష్పాలు రాలుస్తూ, రెండవ నంబరు ప్లాట్‌ఫారంపైకి పరిగెత్తారు.

* * *

తాండూర్ స్టేషన్ మాస్టరుకు సికింద్రాబాద్ సెక్షన్ కంట్రోలర్ 'రింగ్' ఇచ్చాడు.

"తాండూర్, తాండూర్... చెప్పండి సార్. ఐ రిపీటెడ్ ఎ రింగ్" కంట్రోల్ ఫోన్ చెవికి పెట్టుకుని, మోజస్ – డెప్యూటీ స్టేషన్ సూపరెంటెండెంట్ అన్నాడు.

"కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రియర్ జనరల్ కోచ్‌లో విజయనగరం నుంచి ముంబయి వెళ్లే రంగారావు, వడివేలుల ఫామిలీస్ ట్రావెల్ చేస్తున్నారు. రంగారావు, వడివేలుకు సికింద్రాబాద్‌లో బండి మిస్సయింది. వాళ్లు హుసేన్‌సాగర్‌లో వస్తున్నారు. మీ పాయింట్స్‌మాన్‌ని కోణార్క్ రియర్ జనరల్ కోచ్ దగ్గరకు పంపి, రంగారావు, వడివేలుగార్లు వెనుక హుసేన్‌సాగర్‌లో

వస్తున్నారని, కోణార్క్ దిగి హుసేన్‌సాగర్‌లో వెళ్లాలని చెప్పి, దింపేసి, హుసేన్‌సాగర్‌లో ఎక్కించండి. అందరూ కల్సి ముంబయి వెళ్లిపోతారు".

"అలాగే సార్. ఫామిలీలను దింపి, వాళ్లతో పాటు సాగర్‌లో ఎక్కించాలి. అంతేకదా సార్".

"యస్... యస్... అంతే" అన్నాడు స్టేషన్ కంట్రోలర్.

"సుబ్బారావ్, సుబ్బారావ్" పిలిచాడు మోజస్ మాస్టర్.

"వస్తున్నా సార్" అంటూ బయట బెంచీ మీద కూర్చున్న సుబ్బారావు పాయింట్స్‌మాన్ లేచివెళ్లి మోజస్ ముందు ఒబిడియంట్ స్టూడెంట్‌లా చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

మోజస్ మాస్టరు బ్లాక్‌ఫోన్‌ని హుక్‌కి తగిలించి, "కోణార్క్ లైన్‌క్లియర్ ఇచ్చాను. గంట కొట్టు. అలాగే బండి ప్లాట్‌ఫారంపైకి రాక ముందే రియర్ జనరల్ కోచ్ దగ్గరకు నీవు స్వయంగా వెళ్లు. దాంట్లో సికింద్రాబాద్‌లో బండి మిస్సయిన రంగారావు, వడివేలు గార్ల ఫామిలీస్ వస్తున్నాయి. వాళ్లను దింపేసి, మీవాళ్లు వెనక హుస్సేన్‌సాగర్‌లో వస్తున్నారు. వాళ్లతో కలిసి ముంబయి వెళ్లాలని చెప్పు" అన్నాడు.

"అలాగే సార్" అంటూ ప్లాట్‌ఫారంపైకి వెళ్లిపోయాడు సుబ్బారావు.

మరి కాసేపటికి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫారంపైకి వచ్చి ఆగింది.

సుబ్బారావు రియర్ జనరల్ కోచ్ దగ్గరవు వెళ్లి, కిటికీలోంచి తల లోపలకు పెట్టి "రంగారావు, వడివేలు ఫామిలీ ఎవరండీ?" అంటూ అడిగాడు.

"ఆ, మేమేనండి, మేమేనండి" అంటూ అదుర్దాగా సమాధానం వచ్చింది పెట్టెలోంచి.

"మీవాళ్లకు సికింద్రాబాద్‌లో బండి తప్పిపోయింది. వెనక హుస్సేన్‌సాగర్‌లో వస్తున్నారు. మీరు ఇక్కడ దిగండి. మీరు, వారూ కలిసి ముంబయి వెళ్లండి".

"ఎవరు, ఎవరు చెప్పారండీ, ఇంతకీ మీరెవరు?" అడిగింది రంగారావు భార్య.

"నేను తాండూర్ స్టేషన్ పాయింట్స్‌మాన్ నండీ, నాకు మా మాస్టర్‌గారు చెప్పారు. ఊ... దిగండి. తొందరగా సామాన్లు సర్దుకుని దిగండి".

గబగబా సామాన్లు సర్దుకుని దిగిపోయారు అందరూ.

* * *

బేగంపేట నుంచి రంగారావు, వడివేలు హుస్సేన్‌సాగర్‌లో కూడా రియర్ జనరల్ కోచ్‌లోనే ఎక్కారు. తాండూర్‌లో ఆగీఆగగానే హడావిడిగా దిగారు.

"నాన్నా, నాన్నా" అంటూ పోయిన పెన్నిధి దొరికినట్లుగా చుట్టుకుపోయారు పిల్లలు. ఇద్దరి కళ్లల్లో ఎడబాటు తర్వాత తిరిగి కలుసుకోవడంతో ఆనందం వెల్లివిరిసింది. రైల్వేవాళ్లకు మనస్సులోనే కృతజ్ఞతలు తెలిపారు.

"తొందరగా నడవండి బండి కదులుతుంది" అంటూ ప్లాట్‌ఫారం మీద సామాన్లను జనరల్ కోచ్‌లో వేసి, అందర్నీ ఎక్కించి, తాము ఎక్కారు. బండి కదిలింది. సంతోషాన్ని పట్టలేక వడివేలు బ్రాందీ బాటిల్ మూత విప్పి ఇంత నోట్లో పోసుకున్నాడు. అందరూ బిర్యాని పొట్లాలు విప్పుకుని నిలబడే తినడం ప్రారంభించారు. కోణార్క్‌లో విజయనగరం నుంచి జనరల్ కోచ్‌లో అయినప్పటికీ కూర్చుని వచ్చారు. ఇప్పుడు హుస్సేన్‌సాగర్‌లో నిలబడి ముంబయికి ప్రయాణం సాగిస్తున్నారు. ●